క్లుప్తంగా

అరుణాచలానికి ప్రత్యేక బస్సు


ఆర్టీసీ డీఎం సత్యనారాయణ

ధర్మవరం అర్బన్: పౌర్ణమి సందర్భంగా అరుణాచలానికి ప్రత్యేక బస్సు సర్వీసు నడపనున్నట్లు ఆర్టీసీ డీఎం సత్యనారాయణ తెలిపారు. ధర్మవరం ఆర్టీసీ డిపోలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 11న పౌర్ణమి సందర్భంగా అరుణాచలం గిరి ప్రదర్శన, కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ దర్శనార్థం పదో తేదీ ఉదయం ఆరు గంటలకు ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. రానుపోను చార్జీ రూ.1,400గా నిర్ణయించామన్నారు. దర్శనానికి వెళ్లాల్సిన భక్తులు ఆన్‌లైన్‌లో గానీ, బస్టాండ్ రిజర్వేషన్ కౌంటర్‌లో గానీ సీట్లు రిజర్వేషన్ చేసుకోవాలని తెలిపారు. పూర్తి వివరాలకు 63031 51302, 99592 25859 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

శాస్త్రవేత్తల సలహాలు పాటించండి

ఓడీచెరువు : తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం సాధించాలంటే శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు తప్పకుండా పాటించాలని మండల వ్యవసాయధికారి ఇలియాజ్ మహమ్మద్ రైతులకు సూచించారు. మంగళవారం మండలంలోని అల్లాపల్లి, తంగేడుకుంట రైతు సేవ కేంద్రాల్లో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ నిర్వహించారు. వ్యవశాయ శాస్త్రవేత్తలు మంజునాథ్, మాధవి, సజరుద్దీన్ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగకు ప్రత్యామ్నాయంగా కంది, ఆముదం వంటి పంటలు సాగు చేసి అధిక లాభాలు గడించవచ్చన్నారు. కార్యక్రమంలో ఏడీఏ సనావుల్లా, ఉద్యాన శాఖ అధికారి లావణ్య, ఆర్‌ఎస్‌కే సిబ్బంది నరేంద్ర, బాబాజాన్, రైతులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య అందించాలి

ధర్మవరం అర్బన్: విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించినప్పుడే అధ్యాపకులకు సార్థకత లభిస్తుందని జిల్లా వృత్తి విద్యాశాఖ అధికారి సయ్యద్ మౌలా అన్నారు. స్థానిక ప్రభుత్వ బాలికలు, బాలుర జూనియర్ కళాశాలలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. కళాశాలలో ప్రస్తుతం చేపట్టిన అడ్మిషన్ల వివరాలను తెలుసుకున్నారు. అనంతరం ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులతో సమావేశమై మాట్లాడారు. విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రశాంతి, బాలికల కళాశాల ప్రిన్సిపాల్ వాణి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం


యోగాసనాలు చేస్తున్న ఆర్డీఓ, ఎంపీడీఓ

ధర్మవరం అర్బన్: రోజూ యోగా సాధన చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని ఆర్డీఓ మహేష్ తెలిపారు. పట్టణంలోని క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా మంగళవారం యోగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గాజుల సోమేశ్వరరెడ్డి సమక్షంలో యోగాసనాలు నిర్వహించారు. ఆర్డీఓ మహేష్, ఎంపీడీఓ సాయి మనోహర్ హాజరై యోగాసనాలు వేశారు. ఉదయం లేవగానే యోగా సాధన చేస్తే ఎంతో ప్రయోజనం ఉంటుందన్నారు. కార్యక్రమంలో వివేకానంద యోగా కేంద్రం ఆర్గనైజర్ నరసింహులు, లక్ష్మయ్య గురూజీ, తిరుమలేసు, కట్టా రవి, యోగ సాధకులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హైవే పనుల అడ్డగింత


రోడ్డు నిర్మాణ పనులను అడ్డుకుంటున్న రైతులు

ముదిగుబ్బ: జాతీయ రహదారి- 342 నిర్మాణ పనులను ముదిగుబ్బ సమీపంలో రైతులు అడ్డుకున్నారు. ప్రస్తుతం పుట్టపర్తి- ముదిగుబ్బ వరకు రోడ్డు పనులు జరుగుతున్నాయి. అయితే ఈ రోడ్డు కోసం భూములు కోల్పోయిన 20 మందికి పైబడిన రైతులు తమకు సరైన పరిహారం దక్కలేదని ఆందోళనబాట పట్టారు. ముదిగుబ్బకు ఆనుకుని ఉన్న తమ భూములకు మార్కెట్లో మంచి విలువ ఉన్నప్పటికీ.. ప్రభుత్వం నామమాత్రపు పరిహారం ఇస్తోందని వాపోతున్నారు. గత తొమ్మిది రోజులుగా పనులు జరగకుండా అడ్డుకుంటున్నారు. అందులో భాగంగానే మంగళవారం కూడా నిరసన చేపట్టి.. తమకు న్యాయమైన పరిహారం అందించేవరకు పనులు చేపట్టకూడదని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు సోమల ప్రకాష్, ప్రభాకర్ నాయుడు, టీపీ రమణ, మునికుమార్, వెంగమనాయుడు, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రత పాటించాలి

చెన్నేకొత్తపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం అందించేవారు పరిశుభ్రత పాటించాలని ఎంఈఓ ప్రసూన్‌కుమార్‌నాయుడు సూచించారు. మండల కేంద్రంలోని మోడల్ స్కూల్, జూనియర్ కాలేజీలో మంగళవారం మండలంలోని మధ్యాహ్న భోజన ఏజెన్సీ,హెల్పర్లకు ఒకరోజు అవగాహన కార్యాక్రమాన్ని నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడుతూ భోజనం తయారీ సమయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్రిన్సిపాల్ స్వర్ణలత, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆశలన్నీ ఖరీఫ్ పైనే

- సాగుకు సన్నద్ధమవుతున్న రైతులు
- గత ఏడాది దారుణంగా దెబ్బతిన్న పంటలు
- కరువు మండలాల ప్రకటనతోనే సరిపెట్టిన సర్కార్
- ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా పెట్టుబడి సాయం ఊసెత్తని వైనం


పోతులనాగేపల్లి వద్ద వేరుశనగ పంట సాగు కోసం దుక్కులు చేసుకుంటున్న రైతు

ధర్మవరం రూరల్: ఖరీఫ్ -2025పై రైతులు గంపెడాశలు పెట్టుకున్నారు. ఇటీవల పదునైన వర్షాలు కురవడంతో పొలాలు దుక్కులు చేసుకున్నారు. వేరుశనగ, కంది, అలసంద, ఆముదం, మొక్కజొన్న వంటి పంటలను సాగు చేసుకోవడానికి సిద్ధమవుతున్నారు. గతేడాది తీవ్ర నష్టాలతో సతమతమైన రైతులు ఈ ఖరీఫ్‌లోనైనా గట్టెక్కాలని కోరుకుంటున్నారు.

జమకాని ఇన్‌పుట్ సబ్సిడీ

గత ఏడాది ఖరీఫ్, రబీ సీజన్లలో అతివృష్టి, అనావృష్టి కారణంగా పంటలు దెబ్బతిన్నాయి. అప్పట్లో కూటమి ప్రభుత్వం కరువు మండలాలను ప్రకటించి చేతులు దులుపుకుంది. ధర్మవరం వ్యవసాయ డివిజన్ పరిధిలోని మండలాలకు ఇన్‌పుట్ సబ్సిడీగా రూ.4.50 కోట్లు మంజూరు చేసింది. పంటలు నష్టపోయిన ప్రతి రైతునూ ఆదుకుంటామని ప్రకటించింది. అయితే ఇప్పటి వరకు పరిహారం మాత్రం అందనే లేదు. ప్రభుత్వం మాటలకు, చేతలకు పొంతనే లేదని రైతులు వాపోతున్నారు.

అన్నదాత సుఖీభవ.. ఎప్పుడో?

ఎన్నికల ముందు సూపర్ సిక్స్‌లో భాగంగా అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు ఏడాదికి రూ.20వేల పెట్టుబడి సాయం అందిస్తామని కూటమి నేతలు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా ఆ పథకం ఊసే ఎత్తడం లేదు. ఖరీఫ్ ప్రారంభమైన నేపథ్యంలో రైతుల వద్ద పెట్టుబడికి డబ్బు లేదు. పంటలు ఎలా సాగు చేసుకోవాలో తెలియక సతమతమవుతున్నారు. ప్రభుత్వం నుంచి సాయం అందకపోయినా.. విత్తనాలు సకాలంలో సమకూర్చకపోయినా సాగు విస్తీర్ణం తగ్గే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

గత ఏడాది ధర్మవరం నియోజకవర్గంలో పంటల సాగు

మండలం	సాధారణ సాగు (హెక్టార్లలో)	సాగైన విస్తీర్ణం (హెక్టార్లలో)
బత్తలపల్లి	12,000	5,286
తాడిమర్రి	12,000	5,170
ధర్మవరం	17,182	8,992
ముదిగుబ్బ	18,700	7,300

ప్రభుత్వం ఆదుకోవాలి



ఇటీవల కురిసిన వర్షానికి దుక్కులు దున్నుకున్నాను. అయితే పంట సాగు చేసుకోవడానికి చేతిలో చిల్లిగవ్వలేదు. ఈ ఏడాది కంది పంట సాగు చేయాలనుకుంటున్నా. గత ఏడాది కంది సాగుచేసి నష్టాలు చవిచూశాను. మరోసారి అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి సిద్ధపడుతున్నా. గత ఏడాది పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఇన్‌పుట్ సబ్సిడీ అందించి ఆదుకోవాలి.

– నారాయణ, రైతు, చిగిచెర్ల

సబ్సిడీతో ఎరువులు ఇవ్వాలి



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతు భరోసా కేంద్రంలోనే రైతులకు సబ్సిడీపై ఎరువులు అందించారు. ప్రస్తుతం రైతు భరోసా కేంద్రాలు నిర్వీర్యం అయ్యాయి. కూటమి ప్రభుత్వం కరువు మండలాలుగా ప్రకటించింది కానీ ఇప్పటి వరకు రైతులకు ఎటువంటి సాయమూ అందజేయలేదు. ఖరీఫ్ సాగుకు సంబంధించి అవసరమైన ఎరువులను సబ్సిడీపై అందించాలి.

– నారాయణ స్వామి, రైతు, గరుడంపల్లి

వెన్నుపోటు దినాన్ని జయప్రదం చేద్దాం

- వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నేడు నియోజకవర్గ కేంద్రాల్లో నిరసన

పుట్టపర్తి/ నల్లమాడ/ ఓడీచెరువు: ఎన్నికల హామీలను కూటమి ప్రభుత్వం విస్మరించి నేటితో ఏడాది అవుతోంది. నమ్మి ఓట్లు వేసిన ప్రజలకు పథకాలు అమలు చేయకుండా చేసిన వంచనను నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో బుధవారం 'వెన్నుపోటు దినం' చేపట్టనుంది. జిల్లా కేంద్రం పుట్టపర్తిలో ఉదయం తొమ్మిది గంటలకు గణేష్ సర్కిల్ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించనున్నారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున తరలిరావాలని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ సమన్వయ కర్త దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పిలుపునిచ్చారు. నల్లమాడ మండలం నుంచి పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పుట్టపర్తికి చేరుకోవాలని మండల కన్వీనర్ చిట్టిబాల ఆదినారాయణరెడ్డి, ఎంపీపీ డుంగావత్ సునీతాబాయి, బీసీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పొరకల రమణ కోరారు. ఓడీచెరువు మండలం నుంచి పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, మండల కమిటీ సభ్యులు జిల్లా కేంద్రంలో చేపట్టే 'వెన్నుపోటు దినం'లో పాల్గొని విజయవంతం చేయాలని మండల కన్వీనర్ లక్ష్మీరెడ్డి పిలుపునిచ్చారు.


వెన్నుపోటుపై నిరసన గళం వినిపిద్దాం

ధర్మవరం/ బత్తలపల్లి: అధికారం కోసం అలవిగాని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసిన కూటమి పాలకులకు కనువిప్పు కలిగించేలా గళం వినిపించేందుకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు 'వెన్నుపోటు దినం'కు తరలి రావాలని నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం ధర్మవరంలో మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో 'వెన్నుపోటు దినం' జరుగుతుందని పార్టీ జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఉదయం కేతిరెడ్డి క్యాంప్ కార్యాలయం నుంచి ర్యాలీగా కాలేజ్ సర్కిల్, కళాజ్యోతి సర్కిల్ మీదుగా పీఆర్‌టీ స్ట్రీట్, అక్కడి నుంచి ఆర్డీవో కార్యాలయం వద్దకు చేరుకుని నిరసన తెలపనున్నట్లు వెల్లడించారు. సూపర్ సిక్స్ హామీలు అమలు చేయకుండా మంగళం పాడిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందని బత్తలపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటి సురేష్, నియోజకవర్గ కల్చరల్ కమిటీ ప్రెసిడెంట్ షరాబ్ యోగానంద ఆచారి, మండల కన్వీనర్ మాదిరెడ్డి జయరామిరెడ్డి, మాజీ మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి విమర్శించారు. ప్రజలను మోసం చేసిన ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రతి కార్యకర్త, ప్రజలు రోడ్డుపైకి రావాలని పిలుపునిచ్చారు.

వంచనపై సమర శంఖం

కదిరి టౌన్/ తలుపుల/ గాండ్లపెంట/నల్లచెరువు: చంద్రబాబు ప్రభుత్వం ప్రజలకు చేసిన వంచనపై సమరశంఖం పూరించినట్లు వైఎస్సార్‌సీపీ నాయకులు తెలిపారు. పార్టీ అధినేత వైఎస్ జగన్ ఆదేశాల మేరకు బుధవారం నియోజకవర్గ కేంద్రం కదిరిలో 'వెన్నుపోటు దినం' నిర్వహించనున్నట్లు సమన్వయ కర్త బీఎస్ మక్బూల్ అహ్మద్ తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా వెళ్లి తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తారని చెప్పారు. కదిరిలో నిర్వహించే 'వెన్నుపోటు దినం' కార్యక్రమానికి పార్టీ శ్రేణులు, అభిమానులు, అనుబంధ సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని తలుపుల మండల కన్వీనర్ ఫయాజ్ అహమ్మద్, గాండ్లపెంట మండల కన్వీనర్ గజ్జల రవీంద్రారెడ్డి, ఎన్‌పీకుంట మండల కన్వీనర్ కొత్త రంగారెడ్డి, నల్లచెరువు మండల కన్వీనర్ మొండెం రవికుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి

ధర్మవరం రూరల్: వాహనదారులు రోడ్డు నిబంధనలు తప్పక పాటించాలని ధర్మవరం రూరల్ ఎస్‌ఐ శ్రీనివాసులు సూచించారు. మంగళవారం సాయంత్రం ఎస్‌ఐ తన సిబ్బందితో కలిసి పోతుకుంట సమీపంలో వాహనాలు తనిఖీ చేశారు. లైసెన్సులు, వాహన రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆటో డ్రైవర్లు, ద్విచక్ర వాహనదారులకు రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు. మద్యం మత్తులో వాహనాలు నడపరాదన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదన్నారు. ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిబ్బంది నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

రెండు రోజులు తాగునీరు బంద్

ధర్మవరం అర్బన్: ధర్మవరం పట్టణంలో రెండురోజులు తాగునీటి సరఫరా బంద్ చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పార్నపల్లి నుంచి ధర్మవరం వరకు పలుచోట్ల పైపులైన్ లీకేజీలు ఏర్పడి తాగునీరు వృథాగా పోతోందని తెలిపారు. లీకేజీల మరమ్మతుల కోసం ఈ నెల 6, 7 తేదీల్లో పట్టణానికి నీటి సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. మరమ్మతులు పూర్తి చేసి 8వతేదీ నీటి సరఫరా పునరుద్ధరిస్తామని తెలిపారు. ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు.

నమ్మితే నట్టేట ముంచుతారా బాబూ..?

- మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి



రాప్తాడు: హామీలను నమ్మి ఓటు వేసిన ప్రజలు ఇంత దారుణంగా నట్టేట ముంచుతారా అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును రాప్తాడు మాజీ ఎమ్మెల్యే వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి నిలదీశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ కాళ్లు కడిగి కన్యాదానం చేసిన మామ ఎన్టీ రామారావు స్థాపించిన టీడీపీని, ప్రభుత్వాన్ని హస్తగతం చేసుకుని ఆయనకే వెన్నుపోటు పొడిచిన చంద్రబాబు.. నేడు సూపర్ సిక్స్ పేరుతో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి ప్రజలను మోసగించారని విమర్శించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటై సంవత్సరం అయిన సందర్భాన్ని 'వెన్నుపోటు దినం'గా పరిగణిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. తాను అధికారంలోకి వస్తే నిరుద్యోగులకు 20 లక్షల ఉద్యోగాలు, లేదంటే రూ.3 వేలు భృతి చెల్లిస్తామని బాబు చెప్పిన హామీ ఏమైందని ప్రశ్నించారు. అన్నదాత సుఖీభవ పథకం కింద ఏటా రూ.20 వేలు చొప్పున పెట్టుబడి సాయం అందించడం ద్వారా రైతులను ఆదుకుంటామని ఇచ్చిన హామీ ఎక్కడికి పోయిందన్నారు. ఒక ఇంటిలో ఎంత మంది పిల్లలు చదువుకునే వారు ఉంటే అంత మందికి తల్లికి వందనం కింద రూ.15 వేలు చొప్పున ఇస్తామని చెప్పి ఇంత వరకు ఒక్క రూపాయి ఇచ్చిన పాపాన పోలేదని దుయ్యబట్టారు.

మాట తప్పిన బాబు..

స్త్రీ శక్తి కింద 19 నుంచి 60 ఏళ్లలోపు మహిళలకు రూ.15 వేలు ఇస్తామని మాట తప్పారని ప్రకాష్‌రెడ్డి విమర్శించారు. ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందజేస్తామని చెప్పి కొందరికి మాత్రమే వర్తింపజేశారన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం ఇంత వరకు అమలు చేయలేదన్నారు. విద్యా దీవెన, వసతి దీవెన ఇవ్వక పోవడం వల్ల చాలా మంది పేద విద్యార్థులు మధ్యలోనే చదువులకు స్వస్తి చెప్పే పరిస్థితులు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వసతి దీవెన పూర్తిగా రద్దు చేయడం అన్యాయమన్నారు. 50 ఏళ్లు నిండిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు పింఛన్ ఇస్తామన్న హామీ ఇంత వరకు అమలు కాలేదన్నారు. ఉద్యోగులకు నాలుగు డీఏ బకాయిలు, పీఆర్సీ, ఇంటీరియం రిలీఫ్ ఇవ్వలేదన్నారు. ఉద్యోగులకు రూ.20 వేల కోట్ల ఆరియర్స్ ఇవ్వాల్సిందన్నారు. గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేదల కష్టాలను దృష్టిలో ఉంచుకుని ఎండీయూ వాహనాల ద్వారా ఇళ్ల వద్దకే రేషన్ సరఫరా చేశారని తెలిపారు. కానీ చంద్రబాబు రేషన్ డోర్ డెలివరీ రద్దు చేసి పాత పద్ధతిని పునరుద్ధరించడం వల్ల పేదలు, మహిళలు రాత్రి 9 గంటల సమయంలో కూడా ఎఫ్‌పీ షాపుల వద్ద పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. 2019 ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే 90 శాతానికి పైగా అమలు చేశారని తెలిపారు. కరోనా విపత్కర పరిస్థితుల్లోనూ సంక్షేమ పథకాలను కొనసాగించారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించకుండా రెడ్ బుక్ రాజ్యాంగంతో ప్రతిపక్ష పార్టీ నాయకులపై అక్రమ కేసులు బనాయిస్తూ ప్రజలను భయపెట్టేందుకు యత్నిస్తోందన్నారు.

కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు వెన్నుపోటు దినం నిరసన ర్యాలీ విజయవంతం చేయాలని కోరారు. బుధవారం ఉదయం 10 గంటలకు రాప్తాడులో నాలుగు రోడ్ల కూడలిలోని దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించి, అక్కడి నుంచి ర్యాలీ తహసీల్దార్ కార్యాలయం మీదుగా రాప్తాడు బస్టాండు సర్కిల్‌కు చేరుకుని అక్కడా మానవహారం ఏర్పాటు చేసి నిరసన తెలుపుతామన్నారు. అనంతరం అక్కడి నుంచి తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని వినతి పత్రాన్ని తహసీల్దార్‌కు అందజేస్తామన్నారు. రాప్తాడు నియోజకవర్గంలోని పార్టీ శ్రేణులు, ప్రజలు ఉదయం 9 గంటలకే రాప్తాడుకు పెద్ద ఎత్తున చేరుకోవాలని కోరారు.

కార్యక్రమాన్ని జయప్రదం చేద్దాం

కనగానపల్లి: వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో బుధవారం రాప్తాడులో జరిగే వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని జయప్రదం చేద్దామని ఆ పార్టీ జిల్లా యూత్ అధ్యక్షుడు గంగుల సుధీర్‌రెడ్డి పిలుపునిచ్చారు. కార్యక్రమానికి రాప్తాడు నియోజక వర్గంలోని అన్ని మండలాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.

భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వేసుకోవాలి


చిల్లకొండయ్యపల్లిలో రైతులతో మాట్లాడుతున్న శాస్త్రవేత్త సుధీర్

తాడిమర్రి: ఖరీఫ్ సీజన్ పంటల సాగులో భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వేసుకుంటే అధిక దిగుబడి సాధించవచ్చని రేకులకుంట వ్యవసాయ శాస్త్రవేత్త సుధీర్ రైతులకు సూచించారు. మండలంలోని ఎం.అగ్రహారం, చిల్లకొండయ్యపల్లి గ్రామాల్లో మంగళవారం ఆయన పలువురు శాస్త్రవేత్తలతో కలసి ప్రభుత్వ ప్రాయోజిత కార్యక్రమైన వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు సాగుకు సన్నద్ధమైన రైతులకు పంట రకాల ఎంపిక, విత్తన శుద్ధి, సాగులో పాటించవలసిన మెలకువల గురించి వివరించారు. భూసార పరీక్షలు చేయించుకుంటే ఎరువులు వాడకంలో పెట్టుబడి తగ్గించుకోవచ్చన్నారు. కాంప్లెక్స్ ఎరువులు కాకుండా సూటి ఎరువులు వాడాలని, దీనివల్ల మొక్కకు అవసరమైన పోషకాలు మాత్రమే అందించడానికి అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కేవీకే రెడ్డిపల్లి శాస్త్రవేత్త సుధ, ఏడీఏ కృష్ణయ్య, ఏఓ రమాదేవి, హెచ్‌ఓ అమరేశ్వరి, ఏపీఎం సాంబశివుడు, ఆత్మ బీటీఎం ప్రతిభ, రైతు సేవ కేంద్రం సిబ్బంది భారతి, శ్రీకాంత్, విజయ, రైతులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన సేవలందించాలి


రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఫైరోజాబేగం

చెన్నేకొత్తపల్లి: రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని శ్రీసత్యసాయి జిల్లా డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఫైరోజాబేగం వైద్య సిబ్బందిని ఆదేశించారు. ఎన్‌ఎస్‌గేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆస్పత్రిలో జరుగుతున్న ఆశావర్కర్ల సమావేశాన్ని పరిశీలించారు. ముందుగా ఆస్పత్రిలోని పలు రికార్డులను తనిఖీ చేశారు. ప్రతి నెలా ఆస్పత్రిలో ఎన్ని ప్రసవాలు జరుగుతాయి, ఎలాంటి కేసులు ఎక్కువగా వస్తాయని వైద్యుడు డాక్టర్ రవినాయక్‌ను అడిగి తెలుసుకున్నారు. మందులు, సిబ్బంది వివరాలపై ఆరా తీశారు. నిర్ణీత సమయానికి సిబ్బంది విధులకు హాజరై రోగులకు వైద్య సేవలందించాన్నారు. ఆస్పత్రిలో మందుల కొరత రాకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. అనంతరం ఆశావర్కర్ల సమావేశంలో పాల్గొని వారికి పలు సూచనలు చేశారు. వర్షాకాలం ప్రారంభమవుతోందని, గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలని ఆదేశించారు. కరోనాపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

గొర్రెల కాపరులకు రక్షణ కల్పించండి

కనగానపల్లి: గ్రామాల్లో గొర్రెల దొంగతనాలను నివారించి కాపరులకు రక్షణ కల్పించాలని కురుబ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వశికేరి లింగమూర్తి పోలీసు అధికారులను కోరారు. పాతపాళ్యంలో మంగళవారం కురుబ సంఘం నాయకులు పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని గొర్రెల కాపరి బీరయ్యకు చెందిన 30 గొర్రెలను నాలుగు రోజుల క్రితం దొంగలు అపహరించుకొని వెళ్లారన్నారు. దీనిపై బాధితుడు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేస్తే పట్టించుకోలేదన్నారు. దీంతో తాము కనగానపల్లి ఎస్‌ఐతో పాటు ధర్మవరం డీఎస్పీని కలసి దీనిపై ఫిర్యాదు చేశామన్నారు. వెంటనే వారు కేసు నమోదు చేసి, అనుమానితులను గుర్తించారన్నారు. కార్యక్రమంలో కురుబ సంఘం జిల్లా నాయకులు ఈశ్వరయ్య, పామాల రాజశేఖర్, విఠల్‌గౌడ్, కాటమయ్య, దివిటీ సోమశేఖర్ పాల్గొన్నారు.

2,561 క్వింటాళ్ల వేరుశనగ కేటాయింపు

గాండ్లపెంట: ఖరీఫ్ సాగుకు సంబంధించి ఎన్‌పీకుంట మండలానికి 2,561 క్వింటాళ్ల సబ్సిడీ విత్తన వేరుశనగకాయలు కేటాయించినట్లు మండల వ్యవసయాధికారి లోకేశ్వరరెడ్డి తెలిపారు. 40 శాతం సబ్సిడీపై అందించే విత్తన వేరుశనగ కోసం రైతులు ఐదో తేదీ నుంచి రైతు సేవ కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

విత్తన వేరుశనగకు రిజిస్ట్రేషన్ చేసుకోండి

బత్తలపల్లి: విత్తన వేరుశనగ కాయలు కావాల్సిన రైతులు వారి పేర్లను ఆయా రైతు సేవ కేంద్రాలలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఓబిరెడ్డి సూచించారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మండలానికి 1,500 క్వింటాళ్ల విత్తన వేరుశనగ కాయలను కేటాయించినట్లు వెల్లడించారు. కె-6 రకం విత్తన వేరుశనగ 30 కేజీల బస్తా పూర్తి ధర రూ.2,790 కాగా, 40 శాతం సబ్సిడీ పోను రైతు వాటాగా రూ.1,674 చెల్లించాల్సి ఉంటుందన్నారు. అర ఎకరం వరకు (30 కేజీల వేరుశనగ బ్యాగు) ఒక బ్యాగు, అర ఎకరం నుంచి ఎకరం వరకు రెండు బ్యాగులు, ఒక ఎకరం నుంచి ఆపైన భూమి ఉన్న రైతులకు మూడు బ్యాగులు గరిష్ఠంగా అందజేస్తామన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన రైతులకు సూచించారు.

వెన్నుపోటు దినం కార్యక్రమానికి తరలిరండి

చెన్నేకొత్తపల్లి: కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయాలని కోరుతూ బుధవారం రాప్తాడులో జరిగే వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ శ్రేణులు తరలిరావాలని ఆపార్టీ మండల కన్వీనర్ డోలా రామచంద్రారెడ్డి కోరారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పెద్దసంఖ్యలో వచ్చి విజయవంతం చేయాలని కోరారు. మండలంలోని వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు ఉదయం 9 గంటలకు చెన్నేకొత్తపల్లికి చేరుకోవాలని సూచించారు.

పాల సేకరణపై శిక్షణ

తలుపుల : పాడి పరిశ్రమపై ఆధారపడిన మహిళలకు మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో శ్రీజ డెయిరీ వీసీజీ, ఎంఆర్‌జీ ఆధ్వర్యంలో జైకా ప్రాజెక్ట్ సహకారంతో పాల సేకరణ తదితర అంశాలపై శిక్షణ నిర్వహించారు. పాలు పోసే ప్రతి ఒక్కరూ డెయిరీలో భాగస్వాములేనని, పాల ధర, నాణ్యతలో వ్యత్యాసం, ఎస్‌ఎన్‌ఎఫ్ తదితర ఏ సమస్యనైనా ఎప్పటికప్పుడు తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. అనంతరం మహిళా సభ్యులకు మినరల్ మిక్చర్, హార్లిక్స్ బాటిల్ అందజేశారు. కార్యక్రమంలో ఏసీఓ హరిబాబు, పీఐబీ సహదేవరెడ్డి, సూపర్‌వైజర్స్ పురుషోత్తంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేషన్ సక్రమంగా పంపిణీ చేయండి


రేషన్ దుకాణాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

ముదిగుబ్బ: సానేవారిపల్లిలో రేషన్ పంపిణీని మంగళవారం తహసీల్దార్ నారాయణస్వామి పరిశీలించారు. సరుకుల నిల్వ, పంపిణీ తీరును పరిశీలించారు. కార్డుదారులకు రేషన్ సక్రమంగా పంపిణీ చేయాలని డీలర్‌కు సూచించారు.

మహా కుంభాభిషేక మహోత్సవం ప్రారంభం


హోమాలు నిర్వహిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని షిరిడీ సాయిబాబా ఆలయంలో మహా కుంభాభిషేక మహోత్సవం మంగళవారం ప్రారంభమైంది. ఉదయం గంగపూజ, యాగశాల ప్రవేశం, గణపతి పూజ, మహా సంకల్పం, రక్షాబంధన, మండల పూజ, కలశ స్థాపన, సమస్త దేవతల ఆవాహన, గణపతి హోమం తదితర పూజలను అర్చకులు వేదమంత్రాల నడుమ జరిపించారు.లైదో తేదీ షిరిడీ సాయిబాబా ఆలయ వార్షికోత్సవం, త్రిపుర సుందరీదేవి సమేత చంద్రమౌళేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

క్రికెట్ టోర్నీ విజేత ఇటుకలపల్లి జట్టు

కనగానపల్లి: మండల కేంద్రంలో నిర్వహించిన రూరల్ క్రికెట్ టోర్నీ విజేతగా ఇటుకలపల్లి జట్టు నిలిచింది. నెల రోజుల పాటుమొత్తం 65 జట్లు పాల్గొన్న టోర్నీ మంగళవారం ముగిసింది. ఫైనల్ మ్యాచ్‌లో ఇటుకలపల్లిపై కనగానపల్లి జట్టు గెలుపొందింది. విన్నర్స్‌కు స్థానిక సర్పంచ్ అంకె రామక్రిష్ణ రూ.5 వేలు, రన్నర్స్‌కు యూత్ నాయకుడు బట్టా సురేష్ రూ.3 వేల నగదు బహుమతి అందజేశారు. ర్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, టోర్నీ నిర్వాహకులు పాల్గొన్నారు.

బక్రీద్ శాంతియుతంగా చేసుకోవాలి

నల్లచెరువు: బక్రీద్ పండుగను శాంతియుతంగా చేసుకోవాలని కదిరి రూరల్ సీఐ నాగేంద్ర, నల్లచెరువు ఎస్‌ఐ మక్బూల్‌బాషా సూచించారు. నల్లచెరువు పోలీస్ స్టేషన్‌లో మంగళవారం హిందూ ముస్లిం మత పెద్దలతో రూరల్ సీఐ శాంతి సమావేశం నిర్వహించారు. ప్రజలు భక్తి శ్రద్ధలతో బక్రీద్ పండుగను శాంతియుతంగా జరుపుకోవాలన్నారు. గ్రామాల్లో ఎవరైనా మతపరమైన విద్వేషాలు రెచ్చగొట్టే కార్యక్రమాలు చేస్తే పోలీసులకు సమాచారం అందజేయాలన్నారు.